శరవేగంగా సెంట్రల్ సమగ్రాభివృద్ధి

- రూ. కోటి 40లక్షల నిధులతో బీటీ రోడ్డు పనులు
- రూ. 20లక్షలతో వాకింగ్ ట్రాక్ పనులకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే మల్లాది విష్ణు


పూజ చేసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అవసరాలకనుగుణంగా సెంట్రల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్య కాలనీలో రూ. 1.40 కోట్ల నిధులతో బీటీ రోడ్ల నిర్మాణ పనులతో పాటు రామకృష్ణాపురం లైబ్రరీ వద్ద రూ. 19.99 లక్షలతో వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ నిర్మాణ పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డితో కలిసి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయక్ నగర్ ముందు వరుసలో ఉంటాయన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి కొంతమేర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు గుర్తు చేశారు. తర్వాత టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.

అభివృద్ధి బాట

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఈ ప్రాంతం అభివృద్ధి బాట పట్టిందని తెలిపారు. దాదాపు రూ. 23 కోట్లతో అభివృద్ధి పనులు ఈ ప్రభుత్వంలో చేపట్టినట్లు పేర్కొన్నారు. కేవలం రోడ్ల నిర్మాణానికే రూ. 9 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జీవీఆర్‌నగర్‌లో అమృత్ పథకంలో భాగంగా రూ. 6.10 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సంపు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దావు బుచ్చయ్య కాలనీలో రూ. 3.30 కోట్ల అంచనాలతో ఓవర్ హెడ్ వాటర్‌ట్యాంక్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. గంగిరెద్దుల దిబ్బ నుంచి జీవీఆర్‌నగర్ వాటర్ ట్యాంక్ వరకు రూ. 3.29 కోట్లతో 400ఎంఎం మంచినీటి సరఫరా పంపింగ్ మెయిన్ పనులు చురుగ్గా జరుగుతున్నట్లు వివరించారు. ఇప్పటికే రూ. 5 కోట్లతో రాబోయే పదేళ్లకు సరిపడా 33 కె.వి. సబ్‌స్టేషన్‌ను కూడా ఈ ప్రాంతంలో ప్రారంభించుకున్నట్లు మల్లాది విష్ణు గుర్తు చేశారు. రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వరకు ప్రధాన రోడ్డును పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించి ఇటీవల ప్రారంభించుకున్న దేవీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్లు వివరించారు. సంక్షేమాభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరెవరూ సాటిరారని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో డీఈ(ఇంజినీరింగ్) గురునాథం, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు గద్దె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు సహకరించాలి


డోర్ టు డోర్ ఓట్ వెరిఫికేషన్ చేస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఓటర్ల పరిశీలన పక్కాగా జరగాలని, బీఎల్‌ఓలకు సహకరించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ అన్నారు. ఆయన గురువారం ఇందిరానాయక్ నగర్, తోట వారి వీధి, అజిత్‌సింగ్‌నగర్, ఎక్సెల్ ప్లాంట్ వెనుక ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహసముదాయంలో నివసిస్తున్న ప్రజల ఓట్లను తానే స్వయంగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. స్థానికంగా నివసిస్తున్నవారు ఎక్కడినుంచి వచ్చారు, ఎంత కాలం క్రితం వచ్చారు, వారి ఓట్లు ఎక్కడ ఉన్నాయి, స్థానికంగా అందుబాటులో ఉన్న పోలింగ్ స్టేషన్ తదితరాలను పరిశీలించారు. ఓటర్ గుర్తింపు కార్డుల్లో ఎలాంటి మార్పులు చేయాలన్న డిసెంబర్ 5వ తేదీ లోపు చేసుకోవాలన్నారు. పేరులో కానీ చిరునామాలో కానీ ఏదైనా తప్పులు సరి చేసుకోవాలన్నా, పాత ఫొటోను కొత్త ఫొటోతో మార్చాలన్నా తమ బీఎల్‌ఓ ద్వారా కానీ, ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా కానీ, ఎన్.వి.ఎస్.పి పోర్టల్ ద్వారా కానీ, మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేస్తే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని కమిషనర్ చెప్పారు.

పేదలు సంతోషంగా ఉండటమే ధ్యేయం


31వ డివిజన్‌లో సంక్షేమ పథకాలతో కూడిన బోర్డును ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదలు సంతోషంగా ఉండటమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 31వ డివిజన్ పసుపుతోటలోని 205వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష సత్యంతో కలిసి ఎమ్మెల్యే విష్ణు పాల్గొన్నారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఘన నివాళులు అర్పించి.. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయంలో సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. విష్ణు మాట్లాడుతూ 205వ వార్డు సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ. 7,23, 99, 590 మేలు చేకూర్చగా.. నాన్ డీబీటీ ద్వారా రూ.5, 84, 24, 695.. మొత్తంగా రూ.13, 08, 24, 695 లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు ఎస్.హరిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి కంభం కొండలరావు వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

- 32వ డివిజన్ అయోధ్యనగర్ 229వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కోఆప్షన్ సభ్యులు గుండె సుభాషిణీ, డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్ పాల్‌తో కలిసి పాల్గొన్నారు. 229 వ వార్డు సచివాలయ పరిధిలో డీబీటీ ద్వారా రూ.6, 35,94, 579 మేలు చేకూర్చగా.. నాన్ డీబీటీ ద్వారా రూ. 5,16,88, 519.. మొత్తంగా రూ.11, 52,83,98 లబ్ధి చేకూర్చినట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు ఒగ్గు గవాస్కర్, పేరం త్రివేణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకటో డివిజన్‌లో..

గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గుణదల 1వ డివిజన్ కార్మెల్ నగర్‌లో ఏపీకి సీఎం జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. 1వ డివిజన్ లోని 3వ వార్డు సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్ల కాలంలో డీబీటీ ద్వారా రూ. 12.90 కోట్ల మేలు చేకూరిందని వివరించారు. నాన్ డీబీటీ ద్వారా రూ.4.21 కోట్ల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. మొత్తం మీద 17.12కోట్ల లబ్ధి చేకూరిందని స్పష్టం చేశారు. అనంతరం సంక్షేమ కార్యక్రమాల సూచిక బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజ, డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఉద్దంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీ డి బ్లాక్ లోని 264 వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన పాల్గొన్నారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి.. పార్టీ జెండాను ఆవిష్కరించారు. 264 వ వార్డు సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ.12.65 కోట్లు మేలు చేకూర్చగా.. నాన్ డీబీటీ ద్వారా 8.31కోట్ల రూపాయలు.. మొత్తంగా సుమారు 21 కోట్ల వరకూ లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు వి.నారాయణ, బి.దుర్గారావు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీల్లో 'ఎస్టీవీఆర్' సత్తా


ప్రతిభ చూపిన ఎస్టీవీఆర్ విద్యార్థులు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్ 14, అండర్ 19 బాల బాలికల నెట్‌బాల్ రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎస్టీవీఆర్ పాఠశాల విద్యార్థులు బాలుర విభాగం అండర్ -19 నుంచి కె.మోహన్ రావు, కె.రాహుల్ జాన్, అండర్ -19 బాలికల విభాగం నుంచి బి. ప్రవల్లిక, ఎస్.శైలజ, అండర్-14 బాలుర విభాగం నుంచి జె. కరీముల్లా, ఆర్.రాజేష్ బాలికల విభాగం నుంచి ఎస్.సర్వజ్ఞ పాల్గొన్నారు. పోటీల్లో అండర్ -19 బాలురు, బాలికల జట్లు విజయకేతనం ఎగరేసి మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. అండర్ -14 బాలికల జట్టు కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల విద్యార్థుల అభినందన సభ జరిగింది. మొదటి స్థానం సాధించిన అండర్-19 బాలబాలికలు, అండర్- 14 బాలికల జట్టు సభ్యురాలు సర్వజ్ఞలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. సూర్యప్రభ స్టాఫ్ సెక్రటరీ శ్యాంప్రసాద్, ఉపాధ్యాయురాలు ఎల్.విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు క్రీడాకారులకు మెడల్స్ బహూకరించి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

సెలవులో నున్న సీఐ

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసుస్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావు సెలవులో ఉన్నారు. గురువారం నుంచి ఆదివారం వరకు సీఐ సెలవు తీసుకోగా ఆయన స్థానంలో ఇన్‌చార్జి సీఐగా అజిత్‌సింగ్ నగర్ సీఐ గురుప్రకాష్ వ్యవహరిస్తున్నారు.

క్లుప్తంగా

రామలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం కార్తిక ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రీతికరమైన మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి దాట్ల శివరామరాజు పర్యవేక్షించారు

బాధిత కుటుంబానికి సాయం



పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక నివాసి ఏసుబాబు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ పరామర్శించి రూ.10 వేల సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి సాయం అందడానికి కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదకుటుంబాలు ఎలాంటి కష్టాలు పడకూడదనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అన్నారు. కార్యక్రమంలో పార్టీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, పార్టీ నాయకులు రామకృష్ణ, అన్నపురెడ్డి రామిరెడ్డి, కాకర్ల హరి, దాసం దుర్గారావు, ఫణికుమార్, భరద్వాజ్ కుమారస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా యాజ్ఞవల్క్య మహర్షి జయంతి


సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రాచీన వేద భారతావనిలోని మహర్షుల్లో యాజ్ఞవల్క్య మహర్షి అగ్రగణ్యులని, జనక మహారాజు సభలో రాజగురువుగా ఎన్నో సార్లు వాద ప్రతివాదాల్లో సర్వోత్తముడిగా పేరుగాంచారని రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు పేర్కొన్నారు. యాజ్ఞవల్క్య మహర్షి జయంతి వేడుకలు గురువారం సత్యనారాయణపురం శృంగేరి పీఠంలోని శారద ప్రవచన మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో విష్ణు మాట్లాడుతూ యాజ్ఞవల్క్య మహర్షి సూర్య భగవానుడి ఆశీస్సులతో శుక్ల యజుర్వేదాన్ని అభ్యసించారని కీర్తించారు. యోగంపై ఆయన చెప్పిన విషయాలు యోగ యాజ్ఞవల్క్యమనే పేరుతో నేటికీ ప్రచారంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి, యాజ్ఞవల్క్య బ్రాహ్మణ సేవా ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు

ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసాదరావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాదరావు వాహన చోదకులను హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు బుధవారం నగరంలో మోటారు వాహన చట్టం ఉల్లంఘనపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న 52 మంది వాహన చోదకులపై కేసులు నమోదు చేశారు. గురువారం వ్యాస్ కాంప్లెక్స్‌లోని ట్రాఫిక్ కార్యాలయంలో ఏడీసీపీ ప్రసాదరావు ఉల్లంఘనలకు పాల్పడిన వారు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రధానంగా ట్రిపుల్ డ్రైవింగ్ చేసిన వాహన చోదకుల తల్లిదండ్రులకు వారి పిల్లలపై జాగ్రత్త వహించాలని చెప్పారు. అనంతరం ఇంకెప్పుడు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించం అని వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి హైదరాబాద్ భక్తుడి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు గురువారం రూ. లక్ష విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎండీ కుమారి తన బంధువుల ద్వారా నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని ఆలయ ఈవో కె.ఎస్.రామారావుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించిన దేవస్థాన అధికారులు, ప్రసాదాలను ఇచ్చారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన ప్రణవం ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

26న ఉచిత వైద్యశిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు అజయ్ హైస్కూల్లో ఆదివారం పెద్దేశ్వర్ హార్ట్‌కేర్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్ ఏపుగంటి సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండె వైద్య నిపుణులు పల్లెం పెద్దేశ్వరరావు, ఆకాష్ వైద్య బృందం ఉచితంగా వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తారని తెలిపారు. ఈసీజీ, గుండె స్కానింగ్(ఎకో), బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేస్తామని పేర్కొన్నారు. ఉచిత వైద్యశిబిరం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

వెయ్యి మందికి అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు, అయ్యప్ప దీక్షాధారులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు వెయ్యి మంది భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. శ్రీసాయి నక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యాన బాబా పారాయణం జరిగింది. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

కరీముల్లా నగర బహిష్కరణ పొడిగింపు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, అవాంఛనీయ సంఘటనలు, గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా చేస్తున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షేక్ కరీముల్లాకు విధించిన నగర బహిష్కరణను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఎన్టీఆర్ జిల్లా సీపీ టీకే రాణా గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. షేక్ కరీముల్లా వివిధ నేరాలపై అరెస్ట్ అయ్యి, జైలుకు వెళ్లి బయటకు వచ్చిన తర్వాత కూడా నేర ప్రవృత్తిని మార్చుకోకపోవడంతో గతంలో సీపీ అతన్ని నగరం నుంచి బహిష్కరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 40 మందికి జైలు, జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మద్యం సేవించి వాహనాలు నడిపిన 40 మందికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ ఏడవ, ఎనిమిదవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తులు కె.సురేష్‌బాబు, వి. విజయకుమార్ గురువారం తీర్పు వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై గురువారం 1వ, 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 40 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

అయోధ్య రాముడి అక్షింతల కలశ ఊరేగింపు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అయోధ్య రాముడి అక్షింతల కలశ ఊరేగింపు గురువారం చిట్టినగర్ పరిధిలో సాగింది. కేఎల్‌రావునగర్‌లోని అమ్మవారి ఆలయం నుంచి గురువారం ఉదయం పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠం వరకు ఊరేగింపు జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీరామ నామస్మరణతో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్ మాట్లాడుతూ అక్షింతల కలశాన్ని హనుమాన్ ఆలయంలో ఉంచి నిత్యం పూజలు చేస్తారన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి శ్రీరామ చంద్రుని చిత్రపటం, అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ విజయవంతానికి కృషి

కలెక్టర్ ఢిల్లీరావు


టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలో ఈ ఏడాది డిసెంబర్ 12 నుంచి 16 వరకు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 బ్యాడ్మింటన్ జాతీయ టోర్నమెంటు జరుగుతుందని, టోర్నీని విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు కలెక్టర్ ఢిల్లీరావును కలిసి టోర్నీ విశేషాలను వివరించారు. అండర్-19 బాలురు, బాలికల కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడామైదానంలో ప్రారంభ వేడుకలు జరుగుతాయని.. అదే విధంగా సీఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టోర్నీ కన్వీనర్ సి.శివ సత్యనారాయణరెడ్డి, స్టేట్ అండర్-19 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భానుమూర్తిరాజు, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికాంత, సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

శరణు శరణు.. దుర్గాభవానీ..



ఇంద్రకీలాద్రిపై గురువారం కనకదుర్గమ్మ మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాల తర్వాత మాలధారణ జరిగింది. అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా వేదికపైకి తీసుకొచ్చారు. మాలధారులు జై భవానీ.. జైజై భవానీ అంటూ నామస్మరణ చేశారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆర్చర్ జ్యోతి సురేఖ దేశానికే గర్వకారణం


కలెక్టర్ ఢిల్లీరావుకు మెడల్ చూపుతున్న జ్యోతి సురేఖ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వెన్నం జ్యోతి సురేఖ దేశానికే గర్వకారణమని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ ఆర్చర్, డెప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ గురువారం కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో మూడు బంగారు పతకాలు, బ్యాంకాక్‌లో నవంబర్ 3 నుంచి 10 వరకు జరిగిన 23వ ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత రజతం, టీం స్వర్ణ పతకాన్ని సాధించిన జ్యోతి సురేఖను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రం నుంచి భారత జట్టుకు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తుంటే వారిలో జిల్లా నుంచి ఎక్కువ మంది ఉండటం శుభపరిణామమని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు.

మోటారు సైకిల్‌కు నిప్పు!

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబేకాలనీలో ఇంటి ముందు నిలిపిన మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని నున్న పోలీసు స్టేషన్లో ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాంబేకాలనీ బి బ్లాకులో ఉంటున్న గుడిసె వెంకట నాగార్జునకు చెందిన ఏపీ39 ఎస్‌క్యూ-3605 మోటారు సైకిల్‌ను బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మోటారు సైకిల్ యజమాని ఓ మాల్‌లో పార్టుటైమ్ క్యాషియర్. బ్యాంక్ పరీక్ష నిమిత్తం చదువుకొంటుండగా తన బైక్ మంటల్లో కాలిపోతున్నట్టు గమనించి, నీళ్లు తీసుకెళ్లి మంటలను ఆర్పివేసినట్టు, బాధితుడు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

పేదల గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలు

58వ డివిజన్ 239వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు పేదలను వెతుక్కుంటూ గుమ్మం వద్దకే వస్తున్నాయని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58 వ డివిజన్ 239 వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విజయనగర్ కాలనీలో విస్తృతంగా పర్యటించి.. 241 గడపలను సందర్శించారు. గత ప్రభుత్వం ప్రజలను మోసం చేయడానికి ఎన్నికల ముందు ఈ ప్రాంతంలో హడావుడిగా శంకుస్థాపనలు చేయడం తప్ప.. ఏ ఒక్క పనినీ పూర్తి చేసిన దాఖలాలు లేవని మల్లాది విష్ణు విమర్శించారు. ఈ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి వెళ్లి.. మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలులో ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. 96 వార్డు సచివాలయాల పరిధిలో రూ. 19.20 కోట్లతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో.. అనేక కాలనీలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నట్లు వివరించారు.

డిసెంబర్‌లో ముఖ్యమంత్రి పర్యటన

డిసెంబర్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తారని మల్లాది విష్ణు తెలిపారు. ఆయన చేతులమీదుగా పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా హక్కుతో కూడిన ఇళ్ల పత్రాలను అందజేస్తారని తెలిపారు. గత ఎన్నికల్లో 23 స్థానాలకు పరిమితమైన టీడీపీ.. ఈ సారి ఎన్నికల్లో జీరో అవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, శర్మ, కృష్ణమోహన్, తోట వెంకటేశ్వరరావు, వరప్రసాద్, తోపుల వరలక్ష్మి, శోభన్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాబా సేవలో ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కంట్యాక్స్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందరంలో గురువారం ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కంట్యాక్స్ ఎం.ఎస్ వీ.ఎం. ప్రసాద్ దంపతులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మందిరంలో అందిస్తున్న సేవలను ఆలయకమిటీ సభ్యులు తెలియ చేశారు. అనంతరం బాబావారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదంతో సత్కరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.